సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 25 । జనవరి । 2024



**గంజాయి చాక్లెట్ల పట్టివేత**

గంజాయి చాక్లెట్లను రవాణా చేస్తున్న వ్యక్తిని భువనగిరి ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

- 8లో



**వస్త్ర దుకాణాలు బంద్**

పోచంపల్లిలో వస్త్ర దుకాణాలపై అధికారుల దాడులను నిరసిస్తూ వ్యాపారులు ధర్నా చేశారు.

- 10లో



**సైదన్న ఉత్సవాలకు వేళాయె**

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ సైదన్న దర్గా ఉత్సవాలకు ముస్తాబైంది.

- 10లో

## న్యూస్‌రీల్

### యాదాద్రిలో నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

**యాదగిరిగుట్ట రూరల్:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య పూజలు కొనసాగాయి. అర్చకులు వేకువ జామునే ఆలయాన్ని తెరిచి స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ నిర్వహించారు. ఆ తర్వాత అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడుసేవా కార్యక్రమాలు జరిపారు. వివిధ విభాగాల ద్వారా రూ.16,80479 నిత్యాదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

### భువనగిరి ఎంపీపీకి ఆరుగురు ఎంపీటీసీల మద్దతు



తీర్మాన పత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

**భువనగిరి రూరల్:** భువనగిరి ఎంపీపీ నరాల నిర్మలపై ఈనెల 20న పలువురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా, ఎంపీపీకి మద్దతుగా ఆరుగురు ఎంపీటీసీలు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీటీసీల అభిప్రాయాలు, మండల పరిషత్ తీర్మానాల మేరకే ఎంపీపీ నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదుకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో కూనూరు, చందుపట్ల, తుక్కాపురం, పచ్చర్లబోడుతండా, బొల్లేపల్లి, నందనం ఎంపీటీసీలు పాశం శివానంద్, బొక్క కొండల్‌రెడ్డి, రాసాల మల్లేశం, గుగులోతు సుజాత, గడ్డమీది చంద్రకళ, మట్ట పారిజాత ఉన్నారు.

**అవిశ్వాస తేదీని ప్రకటించాలి**

భువనగిరి ఎంపీపీపై అవిశ్వాస తీర్మాన సమావేశం తేదీని ప్రకటించాలని కోరుతూ పలువురు సభ్యులు బుధవారం ఆర్డీఓ కార్యాలయంలోని ఏఓ జగన్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, వైస్ ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, ఎంపీటీసీలు సామల వెంకటేశ్, ఉడుత శారదఆంజనేయులు, కంచి లలితమల్లయ్య, గునుగుంట్ల కల్పనశ్రీనివాస్, రాంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సేవా దృక్పథం అలవర్చుకోవాలి



శిబిరంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

**భువనగిరి రూరల్:** విద్యార్థులు సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) రమణి అన్నారు. భువనగిరి మండలం బస్వాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ శీతాకాలం శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు బస్వాపురంలో పరిసరాలను శుభ్రత చేయడంతోపాటు ఆరోగ్య సర్వే నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకళ, సర్పంచ్ కస్తూరి మంజుల శ్రీశైలం, అధ్యాపకులు అరుణ, సంగీత, ఎలియాజర్, మల్లీశ్వరి, శివ, చందు, రాజు, కళాశాల సిబ్బంది శ్రీనివాస్, కళావతి పాల్గొన్నారు.

### మాల మహానాడు అధికార ప్రతినిధిగా బాబురావు



బాబురావు

**మోత్కూరు:** మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధిగా మోత్కూరుకు చెందిన బోడ బాబురావును నియమిస్తూ బుధవారం ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వెలుతురు మల్లయ్య, రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# అందరూ పీఠం కోసమే..

**మొన్న కలిసికట్టుగా.. నేడు ఎవరికి వారుగా**

- భువనగిరి మున్సిపల్ చైర్మన్ పదవిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ గురి
- ఎవరికి మద్దతివ్వాలో తేల్చుకోలేని బీజేపీ కౌన్సిలర్లు
- ఉత్కంఠగా రాజకీయ పరిణామాలు



మున్సిపల్ కార్యాలయం

**సాక్షి, యాదాద్రి:** భువనగిరి మున్సిపల్ రాజకీయం నాటకీయ పరిణామాల మధ్య రోజుకో మలుపు తిరుగుతోంది. సొంత పార్టీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై ఈనెల 23న అవిశ్వాసం పెట్టి పదవుల్లోంచి దించేసిన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు ఇప్పుడు కాంగ్రెస్ నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారు. తమ పార్టీకి ఉన్న మెజార్టీతో తామే చైర్మన్ పీఠం దక్కించుకుంటామని ఆశపడ్డ బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పక్కలో బల్లెంలా తయారైంది. అవిశ్వాసం నెగ్గేవరకు ఒక్కటిగా ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇండిపెండెట్లు.. ఇప్పుడు చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాసం రంగం కోసం బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్ కొందరు కౌన్సిలర్లతో క్యాంపులు నిర్వహించడం, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కొందరికి ముట్టజెప్పినట్టు సమాచారం.

**పీఠంపై కన్నేసిన కాంగ్రెస్**

బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చైర్మన్ పీఠంపై కన్నేసింది. అధికారంలో ఉన్నాం అవకాశం వచ్చింది ఎందుకు పదవివదులుకుంటామని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఒకరు సాక్షితో పేర్కొనడం గమనార్హం. చైర్మన్ పదవి దక్కించుకోవాలన్న పట్టుదల కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లలో బలంగా ఉంది. వీరిలో తంగెళ్లపల్లి శ్రీవాణి, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పోత్నక్ ప్రమోద్‌కుమార్ ప్రస్తుతం చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. కాంగ్రెస్ మాత్రం తమ పార్టీ నుంచి ఒకరిని చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసే పనిలో పడింది. ప్రస్తుతం వీరికున్న 9 మందికి అదనంగా ఎక్స్ అఫీషియో సభ్యుడు స్థానిక ఎమ్మెల్యే ఉన్నారు. మరో 8మంది సభ్యుల మద్దతు కోసం అంతర్గత చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. బీఆర్ఎస్ నుంచి తమకు 8 మంది సభ్యులు మద్దుతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు సాక్షితో చెప్పారు.

**బీఆర్ఎస్ నుంచి గెలిచింది 15 మంది..**

బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం 20 కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ నుంచి వచ్చినవారు ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు ఇద్దరితోపాటు 15 మంది బీఆర్ఎస్‌పార్టీ నుంచి గెలిచిన వారున్నారు. అయితే చైర్మన్, వైస్‌చైర్మన్, మరో ఇద్దరు కౌన్సిలర్లతో కలిపి మొత్తం నలుగురు అవిశ్వాసానికి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. చైర్మన్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్‌కు వీరు కీలకంగా మారనున్నారు.

**బీజేపీలో అంతర్మథనం**

ఆరుగురు సభ్యులున్న బీజేపీ కౌన్సిలర్లు తీవ్ర అంతర్మథనంలో పడ్డారు. అవిశ్వాసానికి మద్దతు ఇచ్చిన కౌన్సిలర్లు, వచ్చే పాలక వర్గంలో తమకు లభించే పదవిపై చర్చించుకుంటున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లో ఎవరికి మద్దతు ఇవ్వాలి అనే విషయంలో ఇంకా సందిగ్ధంలోనే ఉన్నారు. తమ మద్దతు కోరే వారితో వైస్ చైర్మన్ పదవి డిమాండ్ చేయాలన్న ఒక వర్గం ఆలోచన చేస్తుండగా, ఓటింగ్‌కు దూరంగా ఉండాలని మరో వర్గం భావిస్తున్నట్టు తెలిసింది.

## బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

**భువనగిరి:** ప్రస్తుత సమాజంలో బాలికలు అప్రమత్తంగా ఉంటూనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం భువనగిరిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికా సంరక్షణ, హక్కులు, పోషకాహారం అంశాలపై నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సాంకేతికత పరిజ్ఞానాన్ని అవగతం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు వచ్చిన బాలికలు న్యాయ సేవా సంస్థలను ఆశ్రయించాలన్నారు. అనంతరం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలైన బాలికలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బి.శ్రీనివాస్‌రావు పాఠశాలకు నాప్కిన్ వెండింగ్ మిషన్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, బాలల సంక్షేమ కమిటీ జిల్లా అధ్యక్షురాలు బండారు జయశ్రీ, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, డీఈఓ కె.నారాయణరెడ్డి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.కవిత, ఐసీడీఎస్ పీడీ అన్నపూర్ణ, సీడీపీఓలు నిర్మల, జ్యోతి, రాధ, కళాశాల ప్రిన్సిపాల్ వహీద, ఎస్ఐ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విస్తరిస్తున్న 'కుష్టు'

- ఏటేటా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు
- వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ
- 30 నుంచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు



కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

**భువనగిరి:** జిల్లాలో కుష్టు వ్యాధి విస్తరిస్తోంది. మూడేళ్ల నుంచి వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రాణాంతకమైన వ్యాధి కాకపోయినా నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారి కుష్టు వ్యాధి. గతంతో పోల్చుకుంటే కుష్టు వ్యాధి తగ్గిపోయినప్పటికీ ఇటీవల ఈ వ్యాధి తీవ్రత పెరిగినట్లు వైద్యాధికారులు అంచనా వేశారు. దీంతో జిల్లా వైద్యఆరోగ్యశాఖ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది.

**జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తుల వివరాలు**

| సంవత్సరం | వ్యాధిగ్రస్తులు |
|---|---|
| 2020-21 | 32 |
| 2021-22 | 37 |
| 2022-23 | 68 |

**కోవిడ్ కారణంగా నామమాత్రంగా సర్వే..**

కోవిడ్ కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో జిల్లాలో వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే నామమాత్రంగా సాగింది. దీనిని గుర్తించిన అధికార యంత్రాంగం 2022-23లో 697 బృందాలతో ఆగస్టు 16 నుంచి 31వ తేదీ వరకు కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టారు. గతంలో చేపట్టిన సర్వేలతో పోల్చుతే కుష్టు వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగింది. పెరిగిన వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా మందులు అందజేస్తున్నారు.

**ఫిబ్రవరి 13 వరకు అవగాహన కార్యక్రమాలు**

కుష్టు అనేది చర్మ, నరాలకు సంబంధించిన వ్యాధి. ఈ వ్యాధి రెండు రకాలుగా ఉంటుంది. పాసిబాసిల్లరి లెప్రసీ (పీబీ), మల్టీబాసిల్లరి లెప్రసీ(ఎంబీ). అయితే జిల్లా వ్యాధి తీవ్రతను తగ్గించేందుకు మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందు కోసం ఇప్పటికే ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

**సకాలంలో గుర్తిస్తే నివారించొచ్చు**

కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. సకాలంలో గుర్తిస్తే మందులతో సులువగా నివారించొచ్చు. వ్యాధి లక్షణాలను గుర్తించి వారికి మందులు అందించేందుకు ఏటా సర్వే చేయిస్తున్నాం. గత ఆగస్టులో సర్వే చేసి గుర్తించిన వారికి మందులు అందజేస్తున్నాం. ఈ నెల 30 నుంచి వ్యాధి నివారణ, ఇతర వివరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

–పరిపూర్ణాచారి, డీఎంహెచ్‌ఓ

### 33వ సారి రక్తదానం

**మోత్కూరు:** మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ-పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కురుమేటి నవీన్ రక్తదానంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇప్పటికే 32 సార్లు రక్తదానం చేసిన నవీన్ బుధవారం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో సంతోష అనే మహిళకు రక్తం ఇచ్చి ఆదుకున్నారు. దీంతో తాను ఇప్పటి వరకు 33 సార్లు రక్తదానం చేశానని నవీన్ తెలిపారు.



రక్తదానం చేస్తున్న కురుమేటి నవీన్

# ఓటర్లను చైతన్యపర్చేలా..

- భువనగిరిలో ర్యాలీకి ఏర్పాట్లు
- హాజరు కానున్న కలెక్టర్
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

**భువనగిరి:** భారతదేశం ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిరాయి ఓటు హక్కు. ఏ రాష్ట్రంలోనైనా ప్రజలు తమ ఓటుహక్కు ద్వారానే ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటున్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని.. ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని ఎన్నికల కమిషన్ ఏటా జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఓటర్లను చైతన్యం చేసేలా గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహించాలని యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

**నేడు అవగాహన ర్యాలీలు**

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 6.30 గంటలకు భువనగిరి బాలురు జూనియర్ కళాశాల నుంచి స్థానిక సాయిబాబా ఆలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హనుమంతు కే.జెండగే హాజరు కానున్నారు.

**జిల్లా ఓటర్లు 6,45,385**

జిల్లాలో ప్రస్తుతం 6,45,385 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,22,055 మంది, మహిళలు 3,23,309 మందితో పాటు ఇతరులు 21 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళలు 1,254 మంది ఎక్కువగా ఉన్నారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదుకు ఇప్పటికే ఈనెల 20, 21వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. వీటిపై అభ్యంతరాలు, చేర్పులు, మార్పులను ఫిబ్రవరి 5న పరిశీలించి తుది జాబితాను 8వ తేదిన విడుదల చేయనున్నారు.

### రామన్నపేట ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

**రామన్నపేట:** రామన్నపేట ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిపై ఈనెల 27న నిర్వహించే అవిశ్వాసంపై మంగళవారం హైకోర్టు స్టే ఇచ్చింది. ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని పదిమంది ఎంపీటీసీలు ఈనెల 4న చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావుకు వినతి పత్రం అందజేశారు. సభ్యుల సంతకాలు పరిశీలించిన ఆర్డీఓ ఈనెల 27న అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించేందుక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ ఎంపీటీసీలకు ఈ నెల 6న నోటీసులు జారీ చేశారు. అవిశ్వాసం నోటీసుపై ఎంపీపీ జ్యోతి హైకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ వాదప్రతివాదనలు విన్న కోర్టు అవిశ్వాసంపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తాం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- బొమ్మలరామారం, ఆలేరు, యాదగిరిగుట్ట మండలాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



బొమ్మలరామారం : హాజీపూర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, విప్ ఐలయ్య

**బొమ్మలరామారం:** కాంగ్రెస్ పార్టీది ప్రజా ప్రభుత్వమని, ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో గల షామీర్‌పేట్ వాగుపైన పీఎంజీఎస్‌వై నిధులు రూ.6.31కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మైలారం గ్రామంలో పల్లె దవాఖానా భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హాజీపూర్‌లో ముగ్గురు బాలికలను పొట్టనబెట్టుకున్న సైకో శ్రీనివాస్‌రెడ్డికి శిక్ష పడేలా పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చాన్నారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పుడే బ్రిడ్జి నిర్మాణానికి, మాచన్‌పల్లి నుంచి తిర్మలగిరి చౌరస్తా వరకు రోడ్డు నిధులు మంజూరు చేయించానన్నారు. చీకటిమామిడి నుంచి వడపర్తి వరకు, నాగినేనిపల్లి నుంచి అనంతారం వరకు రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మంత్రిగా మొదటి పర్యటనలోనే రూ.100 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పిస్తామన్నారు. మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం**

హాజీపూర్‌లో సైకో శ్రీనివాస్‌రెడ్డి హతమార్చిన బాలికల కుటుంబాలను ఆదుకుంటామని, విద్యార్హతల మేరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ఇంటిస్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీపీ రాజేష్ చంద్ర, డీఎంహెచ్‌ఓ పరిపూర్ణచారి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు బండ్రు శోభారాణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సరిత, డాక్టర్ శ్రావణ్ కుమార్, సర్పంచ్‌లు తిరుమల కవితా వెంకటేష్, వడ్లకొండ అరుణ ఆనంద్, ఎంపీటీసీలు ఫక్కీరు రాజేందర్‌రెడ్డి, బోయిని లత నర్సింహ, సింగిల్ విండో మాజీ చైర్మన్ మోకు మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేష్, శ్రీరాములు నాయక్, పడమటి పావని, బండ వెంకటేష్, రామిడి జంగారెడ్డి, మాదిరెడ్డి ముకుంద్ రెడ్డి, ధనావత్ సునీత, శ్రావన్ ప్రసాద్‌రెడ్డి, గిరిప్రసాద్, శ్యామల్‌రెడ్డి, బోగ వెంకటేష్, సురేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

**గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం**

**యాదగిరిగుట్ట రూరల్:** గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలో బుధవారం తాళ్లగూడెం-పెద్దకందుకూరు గ్రామాల మధ్య రూ.3.55 లక్షల నిధులతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రంథాలయం, ప్రజావైద్య శాల, మహిళా సంఘ భవనాలను ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీపీ చీర శ్రీశైలం, సర్పంచ్ భీమగాని రాములు, భీమగాని మాధవి, మండల పార్టీ అధ్యక్షుడు కానుగు బాలరాజ్ గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జైన దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం



కొలనుపాక గ్రామంలో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

**ఆలేరు రూరల్:** జైన దేవాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో రూ.17 కోట్లతో లోలెవల్ బ్రిడ్జి, హైలెవల్ బ్రిడ్జి పనులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. కొలనుపాక బ్రిడ్జిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్, సర్పంచ్ లక్ష్మిప్రసాద్‌రెడ్డి, బండ్రు శోభారాణి, నీలం పద్మ, ఆరె ప్రశాంత్, వెంకటేశ్వర్లు, ఉట్కూరి సురేష్, లోకేష్, అజయ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భూదాత మాదిరెడ్డి రాంరెడ్డికి మంత్రి సన్మానం



పల్లె దవాఖానాకు భూమి దానం చేసిన రాంరెడ్డిని సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

బొమ్మలరామారం మండలం మైలారం గ్రామంలో పల్లె దవాఖానా నిర్మాణానికి సుమారు రూ.10లక్షల విలువైన 200 గజాల భూమిని విరాళంగా అందించిన భూ దాత మాదిరెడ్డి రాంరెడ్డిని మంత్రి కోమటిరెడ్డి సన్మానించారు. గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం ప్రశంసనీయమన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేద్దాం




డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్, ఉద్యోగ సంఘాల నాయకులు

**సాక్షి,యాదాద్రి:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉద్యోగులు వారధిలాంటి వారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ ఉద్యోగ సంఘాలు నిర్వహించిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులంతా కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేద్దామని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అందరం కలిసి రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దిగ్విజయంగా నిర్వహిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఏ.భాస్కరరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, కోశాధికారి సురేష్, కలెక్టరేట్ సూపరిటెండెంట్ జగన్, ట్రెసా ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేశ్యా నాయక్, జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భగత్, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఎండీ.ఖదీర్, శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శైలజ, నల్లగొండ జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సెక్రెటరీ కిరణ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గాయపడిన యువకుడు మృతి

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన కేవీఎస్‌రాజు(18), కార్తీక్‌లు పని నిమిత్తం ఈ నెల 23(మంగళవారం)న బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కోదాడ ఆస్పత్రికి చేరుకుని వారిని విజయవాడకు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేవీఎస్ రాజు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

### మట్టపల్లి నృసింహుడి నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుఫర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్,ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు. బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మంత్రి కోమటిరెడ్డికి లడ్డూప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ

- యాదాద్రి కొండపై మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- త్వరలోనే 'బస్వాపురం' సమస్యను పరిష్కరిస్తాం
- అధికారుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. యాదగిరిగుట్ట ప్రెసిడెన్షియల్ అతిథిగృహంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. క్షేత్రానికి వచ్చే రాబడి కోసం కాకుండా భక్తులకు కావాల్సిన అవసరాలపై పట్ల దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొద్దిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి, యాదగిరిగుట్ట, బస్వాపురం ప్రాజెక్టు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. యాదగిరిగుట్టకు మంజూరైన కోర్టు కోసం భవనాన్ని నిర్మించాలన్నారు. బస్వాపురం ప్రాజెక్టుకు సంబంధించి, 3 లక్షల క్యూబిక్ మీటర్ల బండ్ వర్క్ 93శాతం పూర్తయిందని, 11.39 టీఎంసీ నీళ్లను నిల్వచేయవచ్చని, ముంపు బాధితులకు నష్టపరిహారం పునరావాసం చర్యలు చేపట్టాలన్నారు. మల్లన్న సాగర్ నుంచి 16 కిలోమీటర్ల పైప్‌లైన్ బ్యాలెన్స్ వర్క్ నెలలో పూర్తిచేసి మిషన్ భగీరథ తాగునీరు అందించాలన్నారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే. జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈఓ రామకృష్ణారావు, డీసీపీ రాజేష్‌చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరీశుడిని దర్శించుకున్న మంత్రి**

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని అంతకుముందు ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయం ముఖమండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద పూజలు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభానికి మంత్రి మొక్కులు చెల్లించారు. అనంతరం వేద మండపంలో ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనాలను జరిపించగా, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ ఈఓ మంత్రి వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, తదితరులున్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

కోదాడఅర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రజలు తమ హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో రాజనీతిశాస్త్రం విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-ఓటు హక్కు ప్రాధాన్యత అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలలు కనండి సాకారం చేసుకోండి అనే అబ్దుల్ కలాం మాటలను ఆచరణలో పెడితే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ఎన్నికల్లో అవనీతి, బంధుప్రీతికి తావు లేకుండా ఓటు వేసినప్పుడే మంచి పాలన, పాలకుడు వస్తాడన్నారు. అనంతరం రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్ రచించిన యూపీఎస్సీ సివిల్స్ ఎగ్జామ్, ఫైర్ ఆక్స్ హిం ఐఏఎస్ అనే పుస్తకాన్ని కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను కళాశాల అధ్యాపకులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగు, రిటైర్డ్ ఇంటర్ విద్యాధికారి రాజారాంసింగ్, నిర్మల, రాజనీతి అధ్యాపకులు సైదమ్మ, ఎస్‌ఎం రఫీ, ఇంకా ప్రకాష్, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

## చెత్తకుప్పలో మగ శిశువు

- హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కొండమల్లేపల్లి : అప్పుడే పుట్టిన మగ శిశువును చెత్తకుప్పలో వదలేసి మాతృత్వానికి మచ్చ తెచ్చిన ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని వాసవీ బజార్‌లో బోయ సంధ్య ఇంటి వెనక గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే జన్మించిన మగ శిశువును చెత్తకుప్పలో వదిలేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం శిశువు ఏడుపును గమనించిన రమావత్ రజిత అక్కడికి చేరుకొని చూడగా శిశువు కనిపించడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. దీంతో సమాచారం ఐసీడీఎస్ అధికారులు, కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు శిశువును దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం శిశువును నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శిశువు పెదవి సరిగా లేకపోవడం, గ్రహణం పట్టినట్లుగా ఉండడంతోనే వదిలేసి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిశువును ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిలో సూపర్‌వైజర్ రాధ, 9వ వార్డు మెంబర్ బొడిగె లక్ష్మిశ్రీ, అంగన్‌వాడీ టీచర్ శోభ, జ్యోతి ఆయా మాణిక్యమ్మ తదితరులున్నారు.

### కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలి


మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

నేరేడుచర్ల : రాష్ట్రంలో ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల, పాలకీడు మండలాల ఆర్‌ఎంపీ, పీఎంపీల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలకు పారామెడిక్ శిక్షణను పూర్తి చేసిన తరువాత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న గౌడ్, ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీ, కస్తాల వెంకన్న, పిచ్చయ్య, సైదులు, జానయ్య ఉన్నారు.

## మద్యం మత్తులో యువకుల వీరంగం

సూర్యాపేట క్రైం : తాగిన మత్తులో ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు వీరంగం సృష్టించాడు. నలుగురు యువకులతో కలిసి రోడ్డుపై వెళ్తున్న ఆటో డ్రైవర్‌పై తూకం రాయితో దాడి చేయడంతో తల పగిలిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు నెమ్మాది బిట్టు స్నేహితులతో మద్యం సేవించాడు. స్నేహితులు నిఖిల్, బిట్టు మధ్య తాగిన మైకంలో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో బిట్టు నిఖిల్‌ను కొట్టుకుంటూ ఖమ్మం చౌరస్తా వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నిఖిల్‌పై ఆవేశంతో పక్కనే ఉన్న తూకం రాయి తీసుకొని విసరడంతో అటువైపు వెళ్తున్న జానీ అనే ఆటో డ్రైవర్‌కు తగలడంతో తలకు తీవ్రమైన గాయమైంది. అనంతరం అక్కడి నుంచి యువకులు పరారయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు జానీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జానీ ఫిర్యాదు మేరకు బిట్టు, నిఖిల్‌తో పాటు మరో ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు నిఖిల్‌ను అదుపులోకి తీసుకోగా బిట్టు పరారీలో ఉన్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రాజాపేట : కుక్కల దాడిలో పలు గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని సోమారం గ్రామంలో చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పుప్పాల బాలనర్సయ్య ఇటీవల గొర్రెలు కొనుగోలు చేశాడు. వాటిని గతంలో ఉన్న గొర్రెలతో కలిపి మంగళవారం రాత్రి తన కొట్టంలో కట్టివేశాడు. కాగా అర్ధరాత్రి వేళ వీధికుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రెలపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం రైతు వచ్చి చూసేసరికి 8 గొర్రెలు మృతి చెందాయి. రూ. 90వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కలను నివారించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సంపత్

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పెద్దవూర మండలం కేకే తండాకు చెందిన సంపత్ ఎంపికై నట్లు కోచ్ ఆవుల చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ -19 బాలుర విభాగంలో సంపత్ పాల్గొని ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సంపత్ నల్లగొండలోని ఎస్‌ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు.

**కబడ్డీ పోటీలకు రాముడు**


రాముడు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన మాళావత్ రాముడు కర్నాటకలోని మాండ్య జిల్లాలో ఈ నెల 27 వరకు జరిగే జాతీయ స్థాయి కబడ్డీ అండర్ 19 జట్టుకు ఎంపికై నట్లు జైహనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి బుధవారం తెలిపారు. రాముడు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## గంజాయి చాక్లెట్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

భువనగిరి క్రైం : గంజాయి చాక్లెట్లను రవాణా చేస్తున్న వ్యక్తిని బుధవారం ఎక్సైజ్ భువనగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి చాక్లెట్ల రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన తపన్ కుమార్ పరిడ భువనగిరి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండగా టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ స్టేషన్స్ టీంల ఆధ్వర్యంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేసి 24 ప్యాకెట్లలో 869 గంజాయి చాక్లెట్లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి చాక్లెట్ల బరువు సుమారు 4.557 కిలో గ్రాములు ఉన్నాయి. ఈ దాడుల్లో అధికారులు బి.రాధకిషన్, ఎస్ఐలు పి.సాయికిరణ్‌రెడ్డి, జి.నాగరాజు ఉన్నారు.

# చంపేసి.. ఆపై కాల్చేశారు !

- భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో దారుణం
- హతుడిని గుర్తుపట్టకుండా పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు

భువనగిరి క్రైమ్ : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో బుధవారం దారుణం వెలుగుచూసింది. గుర్తుతెలియని వ్యకిని హత్య చేసి గుర్తుపట్టకుండా హతుడి ముఖం ఇతర శరీర భాగాలను పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. నాగిరెడ్డి గ్రామ శివారులోని కాళేశ్వరం కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలాన్ని భువనగిరి ఏసీపీ సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో దుండగులు వారం రోజుల క్రితమే హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. హతుడు సుమారు 5.4 అంగుళాల ఎత్తు, నీలి రంగు జీన్స్ ప్యాంటు, మెరూన్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. హతుడు ఎవరు..? ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొొచ్చి కాల్చేశారా..? ఇక్కడే చంపేసి ఆపై ఆనవాళ్లు దొరక్కుండా చేశారా? హత్యకు గల కారణాలు ఏమిటి? ఇలా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తొలుత మిస్సింగ్ కేసులపై దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

## ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి కోరారు. బుధవారం ఎంజీయూలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమాశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలో 163 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఏర్పాటు చేసి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అధునాతన పోకడలతో పోటీపడుతున్న తరుణంలో మంచి చెడులను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానం క్షేత్ర స్థాయికి చెరితేనే ఫలితాలు సాధిస్తామన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో యూనివర్సిటీ నుంచి పలు కార్యక్రమాలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబర్చిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు మౌనిక, మద్దిలేటి ఈసీ సభ్యులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సాగర్‌లో ఫిల్టర్ హౌస్ సామగ్రి చోరీ


జలాశయ తీరం నుంచి వేసిన పైపులైన్ వెంట తొలగించిన సపోర్ట్ రాడ్స్

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో సుమారు కోటిరూపాయలతో నిర్మించిన ఫిల్టర్‌హౌస్ సామగ్రిని దుండగులు అపహరించారు. జలాశయతీరం నుంచి పైవరకు వేసిన పైపులైన్‌ట్రాక్, నీటిపైపుల వెంట సపోర్ట్‌గా వేసిన ఇనుప చానల్ పట్టీలు, మోటార్లు, గేట్‌వాల్స్ సకలం కనపడకుండా పోయాయి. గ్యాస్‌కట్టర్లను తెచ్చి ట్రాక్‌ను ముక్కలుగా చేస్తూ నిత్యం ఆటోల్లో ఇనుప సామగ్రిని తరలిస్తున్నట్లు సమాచారం. ఆ భూమిలో ఉన్న కంపచెట్లను తొలగించడంతో గ్యాస్‌కట్టర్లు, గ్యాస్ సిలిండర్, విద్యుత్ వైర్లు కనపడ్డాయి. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ పాటికే కింది నుంచి పైవరకుగల కేబుల్ వైరు అందిన కాడికి సామగ్రినంతా దుండగులు తరలించుక పోయారు. ఈ ఘటనపై బుధవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఎన్నెస్పీ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీలో ఎన్నెస్పీ ఉద్యోగుల పాత్రపై ఆరాతీస్తున్నట్లు సమాచారం.

## రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద బుధవారం పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.... యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు చెందిన ధీరావత్ మదు (22), అదే గ్రామానికి చెందిన ధీరావత్ రాము (23)లు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో0 10రూపాయల చొప్పున కొనుగోలు చేసే వీరు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిసరాల్లోని రైసుమిల్లుల్లో 15రూపాయల వంతున అమ్ముతుంటారు. అందులో భాగంగా అశోకా లీలాండ్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## మత్స్యకారులకు చిక్కిన 'వెండి' చేపలు


మత్స్యకారుల వలకు చిక్కిన పలితెజల్ల చేపలు

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు 10 నుంచి 15కేజీల పలితెజల్ల (వెండి) జల్ల చేపలు చిక్కాయి. కృష్ణానదిలో మాత్రమే 2 నుంచి 3 కేజీల బరువుతో లభ్యమయ్యే పలితెజల్ల చేపలు వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు చిక్కడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేములూరు రిజర్వాయర్‌లో నీరు రోజు రోజుకూ అడుగంటుండటంతో ఎప్పుడూ దొరకని చేపలు మత్స్యకారులకు లభ్యమవుతున్నాయని సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యయాదవ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

## సాయం చేసేందుకు వెళ్తూ మృత్యుఒడికి

- డీసీఎం ఢీకొని డ్రైవర్ దుర్మరణం
- మృతుడు ఏపీలోని నంద్యాల వాసి

నల్లగొండ క్రైం : రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి సాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ డీసీఎం డ్రైవర్‌ను మరో డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ పట్టణ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహ్మద్ ఆరీఫ్ (26) డీసీఎం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆరీఫ్ తన డీసీఎంలో బియ్యాన్ని లోడు చేసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మంగళవారం అర్ధరాత్రి నల్లగొండ పట్టణ శివారు పానగల్ బైపాస్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో అక్కడ మిర్చిలోడుతో వెళ్తున్న మినీ ఆటో టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పింది. దీంతో ఆటోలోని మిర్చి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. దీనిని గమనించి ఆరీఫ్ తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఆటో డ్రైవర్‌కు సహాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో డీసీఎం ఆరీఫ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

# బాలుడి హత్య కేసులో జీవిత ఖైదు

- ప్రియుడితో కలిసి కన్నకొడుకును గొంతునులిమి చంపిన తల్లి
- ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు

రామగిరి(నల్లగొండ): ప్రియుడితో కలిసి తొమ్మిదేళ్ల కుమారుడిని కడతేర్చిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ప్రధాన న్యాయమూర్తి నాగరాజు బుధవారం తీర్పు వెల్లడించారు. నల్లగొండ మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పల్లెటి వెంకన్నకు నాంపల్లి మండలం నల్లవానికుంట గ్రామానికి చెందిన విజయతో 2007వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి అఖిల్, నాగరాజు సంతానం. వెంకన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య విజయ వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డి వద్ద భార్యభర్తలు కూలికి వెళ్తుంటారు. ఈ క్రమంలో తోకల వెంకట్‌రెడ్డి విజయతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఒక రోజు విజయతో పాటు చిన్న కుమారుడు నాగరాజు పని ప్రదేశానికి వెళ్లాడు. ఆ రోజు వెంకట్‌రెడ్డితో విజయ కలిసి ఉండగా నాగరాజు చూసి తండ్రి వెంకన్నకు చెప్పాడు. దీంతో విజయ, వెంకట్‌రెడ్డిలను వెంకన్న మందలించి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు.

**విషయం తండ్రికి చెప్పాడని గొంతు నులిమి..**

కొన్ని రోజుల తర్వాత 2020 ఫిబ్రవరి 21వ తేదీన వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి పనికి రావాలని వెంకన్నను కోరగా వెళ్లాడు. గంట తర్వాత వెంకన్న తిరిగి ఇంటికి వచ్చాడు. అనంతరం పని నిమిత్తం రాముల బండ గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి వెంకన్న ఇంటికి వచ్చి విజయతో కలిసి ఉన్నాడు. దీనిని విజయ చిన్నకుమారుడు నాగరాజు చూశాడు. విషయం తండ్రికి చెప్తాడని కంగారు పడిన విజయ, వెంకట్‌రెడ్డిలు నాగరాజు(9)ను గొంతు నులిమి చంపేశారు. వెంకన్న ఇంటికి వచ్చి చూడగా కొడుకు మంచంలో విగతజీవిలా పడి ఉన్నాడు. నాగరాజు గొంతుపై నులిమిన ఆనవాళ్లు ఉన్నాయి. భార్య విజయ కనిపించలేదు. గ్రామస్తులను ఆరా తీయగా వెంకన్న ఇంట్లో లేని సమయంలో మధ్యాహ్నం వెంకట్‌రెడ్డి ఇంటికి వచ్చినట్లు చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన వెంకన్న నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సీఐ ప్రసాద్, ఎస్ఐ కె.చంద్రశేఖర్‌రెడ్డి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కానిస్టేబుల్ ఎస్.సురేష్, బి.సుమన్, కోర్టు లైజన్ ఆఫీసర్ పి.నరేందర్ ఆధారాలు కోర్టుకు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు ఏ1 విజయ, ఏ2 వెంకట్‌రెడ్డిలకు జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.